క్లుప్తంగా

తగ్గుతున్న నీటి నిల్వలు


ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా తగ్గుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి నీటి సరఫరా అంతంత మాత్రంగా ఉండడంతో ఈ పరిస్థితి ఎదురైంది. శనివారం నాటికి ప్రాజెక్టులో 86.56 మీటర్లకు 68.75 మీటర్లు, 24.11 టీఎంసీలకు 3.70 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. దిగువ ప్రాంతంలో పంటల సాగు లేక ఆయకట్టుకు నీటి విడుదల నిలిపివేశారు. విశాఖకు 125 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. పంపా, తిమ్మరాజు చెరువుకు నీటి సరఫరా నిలిపివేశారు.

అప్రమత్తంగా ఉండండి

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపాన్‌గా మారనున్న నేపథ్యంలో మండలంలోని అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి సూచించారు. తుపాన్ కారణంగా ఈదురు గాలులు వీచే అవకాశం ఉండటంతో తీరప్రాంత గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. శిథిలమైన ఇళ్లలో నివాసం ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలన్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే తక్షణమే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలన్నారు. తుపాను తీరందాటి సాధారణ పరిస్థితులు ఏర్పడే వరకూ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.

సాంకేతిక విధానాలను అనుసరించాలి


నమూనాలను తిలకిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

గోకవరం: మారుతున్న వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా ఉద్యాన రైతులు సరికొత్త సాంకేతిక విధానాలను అనుసరించాలని రంపచోడవరం ఉద్యాన పరిశోధన సంస్థ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్ సూచించారు. వీరలంకపల్లి గ్రామంలో రామకృష్ణా గార్డెన్స్‌లో శనివారం రైతులకు గ్రామీణ ఉద్యాన కృషీ అనుభవ కార్యక్రమం నిర్వహించారు. దీనిని కోరుకొండ ఏడీఏ బీకే మల్లికార్జున్ రావు ప్రారంభించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పీసీ వెంగయ్య రైతులను, ఉద్యాన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మామిడి, జీడి మామిడిలో వచ్చే వివిధ రకాల తెగుళ్లు, చీడపీడలు, వాటి నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు తయారు చేసిన వినూత్న వ్యవసాయ సాంకేతికతల నమూనాలను సందర్శించి అభినందించారు.

ఖరీఫ్ సాగుకు కార్యాచరణ


తొండంగిలో సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న భ్రమరాంబ

తొండంగి: తొలకరి వర్షాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఖరీఫ్ సాగుకు కార్యాచరణపై గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు దృష్టి సారించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు భ్రమరాంబ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గ్రామ సచివాలయాల అగ్రికల్చర్, ఉద్యాన వన సహాయకులు, సిబ్బందితో ఖరీఫ్ సాగుకు సమాయత్తంపై సమీక్షించారు. రైతులు క్షేత్రస్థాయిలో సాగు చేయాల్సిన మేలు రకమైన పంటలపై అవగాహన కల్పించాలన్నారు. ఏఓ ఎస్.నరసింహం, ఏఈఓ దైవప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. చినశంకర్లపూడిలో క్వారీ క్రషర్‌లో అదే గ్రామానికి చెందిన అడపా దొరబాబు (35) క్రషర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. క్రషర్ ఆపరేట్ చేసే పనిలో భాగంగా అతను విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితికి చేరుకున్న దొరబాబును ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ వివరించారు.

పలువురికి గాయాలు

గండేపల్లి: మండలంలో శనివారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డు భద్రతా సిబ్బంది కథనం ప్రకారం.. జగ్గంపేట నుంచి గండేపల్లి వెళ్తున్న లారీ బొర్రంపాలెం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న మోటార్ సైకిలిస్టు ఢీకొట్టాడు. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అలాగే విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కారు బొర్రంపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి టైరు పేలిపోవడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. కారులోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

వెదజల్లుకు పోదాం పదపద

- ఈ విధానంలో సాగుతో అధిక దిగుబడులు
- ఎకరాకు రూ.10 వేల ఆదా


కోటనందూరులో వెదజల్లు పద్ధతిలో వరి విత్తనాలు చల్లిన పొలం (ఫైల్)

కోటనందూరు: అవగాహనతో ముందుకు వెళ్తే సాగులో సిరులు పంటే.. అధికారుల సూచనలు పాటిస్తే దిగుబడులు ఆశాజనకమే.. తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించాలన్నా, కూలీలు, ఎరువులు, పురుగు మందుల సమస్యను అధిగమించాలన్నా వరి సాగులో 'వెదజల్లు' విధానం మేలైంది. రైతులు ఆ దిశగా అడుగులేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచిస్తోంది. ఈ విధానంలో నారుతీత, నాట్ల ఖర్చు ఉండకపోగా విత్తనాలు, కూలీల ఖర్చు తక్కువగా ఉంటుంది. తెగుళ్లు, ఎలుకల బెడద తక్కువగా ఉండి ఎకరాకు రూ. 10 వేల వరకూ పెట్టుబడి తగ్గుతుంది. ఇప్పటికే రైతుభరోసా కేంద్రాల్లో వ్యవసాయాధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి వెదజల్లు విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

ప్రస్తుతం తుని సబ్ డివిజన్ పరిధి ఐదు మండలాల్లో రైతులు 40 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అధికారుల అంచనా. ఖరీఫ్ ఆలస్యం కావడంతో అపరాల సాగులో కూడా జాప్యం జరిగి తీవ్ర నష్టం వాటిల్లుతున్న పరిస్థితిని అధిగమించాలంటే వెదజల్లు విధానం మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సాగునీటి వసతి లేని రైతులు, తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు సాధించాలనుకునే వారు ఈ విధానం వైపు అడుగు లేయాలని చెబుతున్నారు.

సాగు చేసే విధానం

వేసవి దుక్కి చేసిన పొలంలో ఎదిగిన గడ్డి, పిచ్చిమొక్కలను దమ్ములో కలియదున్ని వారం రోజులు ఉంచితే పొలం సారవంతం అవుతుంది. ఇలా దుక్కి చేసిన పొలాన్ని సమాంతరంగా తయారు చేసి నాటడానికి 24 గంటల ముందు వరి విత్తనాలు నానబెట్టి చిన్నగా మొలకెత్తిన తరువాత ప్రతి రెండు మీటర్లకు కాలిబాట ఉండే విధంగా విత్తనాలు చల్లుకోవాలి. విత్తనాలు దూరంగా నాటడం వల్ల గాలి, వెలుతురు అధికంగా ఉండి విత్తనాలు చల్లిన 15 రోజుల తరువాత పంట ఆశాజనకంగా ఎదుగుతుంది.

కలుపు నివారణ ఇలా..

విత్తనం వేసిన తరువాత రోజే పొలంలో కలుపు మందు పిచికారీ చేసుకోవాలి. విత్తనం వేసిన మూడు రోజుల తరువాత 'సాతి' అనే కలుపు మందును మరోసారి స్ప్రే చేయాలి. వారం తరువాత 'టాప్‌స్టార్' అనే కలుపు మందును ఇంకొకసారి వాడుకోవాలి. విత్తనాలు చల్లిన 15 నుంచి 20 రోజుల తరువాత కలుపు నివారణకు ఎకరాకు 80 నుంచి 100 గ్రాముల పైరజోసల్ఫ్యూరాన్‌ఇథైల్ పిచికారీ చేయడం లేదా ఎకరాకు 30–35 గ్రాములు ఆక్సాడ్‌యార్జిల్ 20 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవడం ద్వారా కలుపును పూర్తిగా నివారించవచ్చు. సాధారణ విధానంలో ఎకరాకు 30 నుంచి 35 కిలోల వరి విత్తనాలు చల్లాల్సి ఉండగా, ఈ విధానంలో 10–12 కిలోలు చల్లితే సరిపోతుంది. ఈ విధానంలో నారుమడి తయారీ, నారుతీత, నాట్లు వేసే ఖర్చు ఉండదు. కాలిబాటలు ఉండే విధంగా విత్తనాలు చల్లడం వల్ల గాలి, వెలుతురు మెండుగా ఉండి పంట బాగా ఎదిగి ఎకరాకు ఐదారు బస్తాల వరకూ అధిక దిగుబడి వస్తుంది. ఈ విధానంలో పంట ఆశాజనకంగా ఎదగడంతో అధిక మోతాదులో ఎరువులు వాడితే పంట ఇంకా ఎక్కువ ఎదిగి కింద పడిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ప్రధాన, కాంప్లెక్స్ ఎరువుల వినియోగం వ్యవసాయాధికారుల సూచనల మేరకు మాత్రమే వాడాలి.

కూలీల సమస్యకు పరిష్కారం



ప్రస్తుతం వ్యవసాయ కూలీల రేట్లు భారీగా పెరిగిపోయాయి. అదీ అవసరానికి కూలీలు రావడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగు చేయాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రెండేళ్లుగా వెదజల్లు పద్ధతిలో వరి సాగు చేశాను. తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు వచ్చాయి. పెట్టుబడి భారీగా తగ్గి, కూలీల సమస్యకు పరిష్కారం దొరికింది.

– అంకంరెడ్డి నారాయణమూర్తి, రైతు, అల్లిపూడి

పెట్టుబడి తక్కువ



వెదజల్లు పద్ధతిలో పెట్టుబడి తక్కువగా ఉంటుంది. నారుమళ్ల తయారీ, నారుతీత, నాట్ల ఖర్చు ఉండదు. కూలీలు, సాగునీటి వినియోగం, తెగుళ్ల బెడద తక్కువగా ఉంటాయి. అధికారుల సూచనల మేరకు ఎరువులు, పురుగు మందులు వాడితే సాధారణం కన్నా అధిక దిగుబడులు వస్తాయి. పంటకు ఆరుతడి సరిపోతుంది. రైతులు వెదజల్లు వైపు అడుగులేస్తే లాభదాయకంగా ఉంటుంది.

– కేజే చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి, కోటనందూరు

విద్యార్థులకు వేసవి శిక్షణ


ఏలేశ్వరం గ్రంథాలయంలో శిక్షణ శిబిరంలో విద్యార్థులు

ఏలేశ్వరం: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణలో మాస్టర్ ట్రైనర్ మజ్జి నాగేశ్వరరావు గణితంతో పాటు నీతికథలు, స్పోకెన్ ఇంగ్లిష్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు.

కిర్లంపూడి: వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కిర్లంపూడి గ్రంథపాలకుడు డి.మరిడిబాబు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగింది. విద్యార్థులకు పెయింటింగ్, బుక్ రీడింగ్, కథలు చెప్పడం వంటి వాటిపై వివరించారు.

విద్యా కానుక కిట్లు అందరికీ చేరాలి


మల్లేపల్లి హైస్కూల్‌లో తనిఖీ చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

గండేపల్లి: విద్యా కానుక కిట్లు ప్రతి విద్యార్థికి అందేలా చూడాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. మల్లేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ పాయింట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యా కానుక కిట్లు అందించేందుకు సిద్ధపడాలని తెలియజేశారు. నాడు-నేడు పనులకు సంబంధించి హైస్కూల్ హెచ్ఎం జి.సుధామాధురిని వివరాలు అడిగి తెలుసుకుని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఈఓలు కేహెచ్ నాయక్, కె.వెంకటరెడ్డి ఉన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

జగ్గంపేట: వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. జగ్గంపేట మండలంలో నాడు- నేడులో పూర్తయిన భవనాలు, చేపట్టిన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ నిర్మాణాలు వేగవంతం చేయాలని తెలిపారు. పాఠశాలలకు వచ్చిన విద్యాకానుక సామగ్రిని ఆయన జగ్గంపేట మండల పాయింట్‌లో పరిశీలించారు. జగ్గంపేటలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరిగే మూడు ప్రాంతాలను ఆయన తనిఖీ చేశారు. మండల విద్యాశాఖాధికారి ఆర్.స్వామి, ఎంఈఓ–2 సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు

మండల సమావేశానికి అధికారుల డుమ్మా

చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి రోడ్లు, భవనాల శాఖ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, మత్స్య తదితర శాఖల అధికారులు డుమ్మా కొట్టడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం- పెద్దిపాలెం ఆర్టీసీ బస్సును రద్దు చేయడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చినశంకర్లపూడి సర్పంచ్ ఏపూరి రామారావు అన్నారు. ఏలేశ్వరం నుంచి వచ్చే బస్సులు ఉదయం, సాయంత్రం ఒకదాని వెంట ఒకటి వెళ్తున్నాయని, బస్సు సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఆయన కోరారు. సమస్యపై విద్యుత్ శాఖ సిబ్బందికి ఫోన్ చేస్తే కనీసం స్పందించడం లేదని ప్రత్తిపాడు ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు ఆరోపించారు. మబ్బులు వేస్తే కరెంటు కట్ చేస్తున్నారని, మూడు రోజులుగా గ్రామానికి తాగునీరు కూడా అందించలేకపోతున్నామని శరభవరం సర్పంచ్ అమరాది వెంకట్రావు అన్నారు. సాగునీటి చెరువులకు షట్టర్లు ఏర్పాటు చేయాలని టి.రాయవరం, ఉత్తరకంచి ఎంపీటీసీ సభ్యులు తటవర్తి రామన్నదొర, ఉమ్మిడి తాతీలు కోరారు. ప్రత్తిపాడు హైస్కూల్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి కోరారు. మండలంలో అన్ని గ్రామాలకు దశలవారీగా త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా చేస్తామని ట్రాన్స్‌కో జేఈ చినబాబు చెప్పారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు కోరుతూ ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఎంపీపీ తెలిపారు. వైస్ ఎంపీపీలు ఏనుగు శ్రీను, లొండ రత్నకుమారి, ఎంపీడీఓ డేవిడ్‌రాజ్, ఈఓపీఆర్డీ కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీలో ఉద్యోగ మహోత్సవం

- 490 మందికి ఉద్యోగాలు
- తల్లిదండ్రులకు సత్కారాలు


ఉద్యోగం పొందిన విద్యార్థి, తల్లిదండ్రులను సత్కరిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పట్టా పొందిన ఏ విద్యార్థీ ఉపాధి కోసం ప్రజాప్రతినిధుల సిఫార్సు కోసం తిరగకూడదు. ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్ష. ఇందుకు అనుగుణంగా విద్యా విధానంలో ఆయన ప్రభుత్వం వివిధ మార్పులు తీసుకువచ్చింది. ముఖ్యంగా నైపుణ్యంపై దృష్టి పెట్టింది. దీంతో విద్యార్థులను వెతుక్కుంటూ సంస్థలే రావడం మొదలైంది. ఒకప్పుడు ఉన్నత విద్య ఇంజినీరింగ్‌లో మాత్రమే ఆఖరి సంవత్సరం అదీ పేరొందిన ప్రభుత్వ లేదా ప్రైవేట్ కళాశాలలకు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించేవారు. ఇప్పుడు అదే పంథా పాలిటెక్నిక్ కళాశాలకు విస్తరించింది. పదో తరగతి పూర్తయిన తరువాత పాలిటెక్నిక్ మూడేళ్లు అభ్యసించగానే వారి సామర్థ్యాన్ని బట్టి ఉపాధి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాలలో ఉద్యోగ మహోత్సవం పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను అందరి సమక్షంలో సత్కరించే సరికొత్త సంప్రదాయానికి నాంది పలికింది. కాకినాడ ఆంధ్రాపాలిటెక్నిక్ కళాశాలలో వివిధ బ్రాంచ్‌లకు చెందిన తృతీయ సంవత్సర విద్యార్థులు 490 మంది వార్షిక ఆదాయం రూ.1.8 లక్షల నుంచి రూ.8.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. దీంతో కళాశాలలో శనివారం ఉద్యోగ విజయోత్సవం పేరుతో కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా వీల్ ఇండియా లిమిటెడ్ హెచ్ఆర్ ఎ.దివాకర్, కాకినాడ సీపోర్టు ప్రతినిధి కరీమ్, ఎంవీఐ హరనాథ్‌రెడ్డి, ఎస్‌సీఎస్ గ్రూప్ హెచ్ఆర్ పీవీఎస్ఎస్ మూర్తి హాజరై విద్యార్థులకు విద్య ప్రాముఖ్యాన్ని వివరించి విద్యార్థులు,వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జనార్దన రావు, ఎంఎస్ఎన్ చారిటీస్ చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్, ఎ.రమణబాబు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు


వేలంకలో పోలీస్ పికెట్

కిర్లంపూడి: కౌంటింగ్ సమయంలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జగ్గంపేట సీఐ లక్ష్మణరావు హెచ్చరించారు. కృష్ణవరం, ముక్కొల్లు, వేలంక గ్రామాల్లో స్థానిక నాయకులతో శనివారం సమావేశాలు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగిందని, 4న ఫలితాల సమయంలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు సిబ్బందితో నిఘా ఉంచామని చెప్పారు. బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల ఫలితాలు ఏ పార్టీకి అనుకూలంగా వచ్చినా సామరస్యంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ సందర్భంగా వచ్చే నెల 4న ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఏఎస్సై బలరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలు నిర్మిద్దాం


ప్రత్తిపాడు సభలో అమరులకు నివాళులర్పిస్తున్న లిబరేషన్ నాయకులు

ప్రత్తిపాడు: ప్రజా ఉద్యమాలను నిర్మించి సమాజాన్ని కాపాడుకుందామని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు పిలుపునిచ్చారు. స్థానిక లిబరేషన్ పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా స్థాయి నక్సల్బరీ డే జరిగింది. బంగార్రాజు మాట్లాడుతూ నక్సల్బరీ అనేది, పేదలకు అధికారం కోసం జరిగిన ఓ మహోన్నత ఉద్యమమని అన్నారు. లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.జనార్దన్, మానుకొండ లచ్చబాబు, గొడుగు సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనకు వ్యతిరేకంగా బలమైన పోరాటానికి సిద్ధం కావాలన్నారు. అనంతరం అమర వీరులకు నివాళులర్పించారు. లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు సామిరెడ్డి నారాయణమూర్తి, తాడి నాగేశ్వరరావు, పేరు లక్ష్మి, జక్కంపూడి రాజు, చిన్నం లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తత అవసరం


కొత్తూరులో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యురాలు సౌమ్యశ్రీ

శంఖవరం: డెంగీ వ్యాధి సోకకుండా అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. కొత్తూరు గ్రామంలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమకాటుతో డెంగీ వస్తుందని, దీనికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదన్నారు. లక్షణాలను బట్టి చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలితో కూడిన జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వర్షాకాలంలో దోమల బారిన పడకుండా తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంలో నంబర్ వన్

- నంబర్ ప్లేట్లు లేకుండానే లారీల రాకపోకలు
- నిబంధనలకు తిలోదకాలు


గోపాలపట్నం - తొండంగి ప్రధాన రహదారిలో నంబర్ ప్లేట్లు లేకుండా వెళ్తున్న టిప్పర్ లారీలు

తొండంగి: అడిగేవారు లేక.. నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. పట్టించుకునే వారు లేక ఇష్టారాజ్యంగా సాగిపోతున్నారు. తొండంగి మండలంలో రయ్ రయ్‌మంటూ పరుగులు తీస్తున్న టిప్పర్ లారీలకు కనీసం నంబర్ల ప్లేట్లు లేకపోవడం శోచనీయం. కోన తీరప్రాంతంలో పరిశ్రమలు, హేచరీలు, మినీపోర్టు అభివృద్ధితో పాటు ఇతర రంగాల నిర్మాణాల రీత్యా నిత్యం టిప్పర్ లారీలు గ్రావెల్, ఇతర మెటీరియల్ తరలింపు కోసం కత్తిపూడి నుంచి రావికంపాడు, ఏవీ నగరం మీదుగా, అన్నవరం నుంచి గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం, తొండంగి గ్రామాల మీదుగా ఒంటిమామిడి బీచ్ రోడ్డులో పలు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. రవాణా శాఖ నిబంధనల ప్రకారం ప్రతి టిప్పర్ లారీకి రెండు వైపులా నంబర్ ప్లేట్లు స్పష్టంగా వేయించాలి. ముఖ్యంగా వెనుక భాగంలో పెద్ద అక్షరాలతో కనిపించేలా నంబరు ఉండాలి. అంతేకాకుండా రాత్రి సమయాల్లో వీటిని గుర్తించేందుకు రేడియం స్టిక్కర్లు కూడా అంటించాల్సి ఉంటుంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా లారీ నంబర్ లేకుండానే రాకపోకలు సాగిస్తున్నాయి. కొంతమంది లారీ డ్రైవర్లు సుద్ద ముక్కలతో లారీ నంబర్లను మొక్కుబడిగా రాసి వెళ్లిపోతున్నారు. దీనికితోడు లారీల వేగానికి కళ్లెం ఉండడం లేదు. ఇతర వాహనాల రాకపోకలతో పాటు టిప్పర్ లారీల వేగం కారణంగా తరచూ రావికంపాడు, తొండంగి ప్రధాన రహదారుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అటువంటి ప్రమాదాల్లో కనీసం మానవత్వాన్ని మరిచి ప్రమాదానికి గురైన వాహనాలను ఆపకుండా వెళ్లిపోయిన సంఘటనలు అనేకం ఉన్నారు. నంబర్లు లేకపోవడంతో ప్రమాదానికి కారణమైన వాహనాలను (హిట్ అండ్ రన్ కేసుల్లో) గుర్తించేందుకు పోలీసు, రవాణా శాఖ అధికారులకు కత్తిమీద సాముతుంది. ఇటువంటి సంఘటనల కారణంగా రోడ్డు ప్రమాదాలకు గురైన క్షతగాత్రులు, బాధిత కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఇప్పటికైనా పోలీసు, రవాణా శాఖ అధికారులు దృష్టిసారించి తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరికలు జారీ చేశాం..

వాహన తనిఖీల సమయంలో నంబర్ ప్లేట్లు లేకుండా వెళ్తున్న వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం. ఇప్పటికే ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లకు, వాహన యజమానులకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. చట్టపరంగా తీసుకునే చర్యలపై అవగాహన కల్పించాం. ఇప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కచ్చితంగా తగిన చర్యలు తీసుకుంటాం.

– బి.శ్రీనివాస్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, కత్తిపూడి యూనిట్ కార్యాలయం

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఎస్పీ సతీష్‌కుమార్


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

కాకినాడ రూరల్: ప్రతి విద్యార్థీ వారి తల్లిదండ్రుల ఆశీర్వాదాలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆకాంక్షించారు. స్థానిక రమణయ్యపేటలోని మూడో బెటాలియన్ ఏపీఎస్పీ ఇంగ్లిష్ మీడియం హై స్కూల్ విద్యార్థుల పదో తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ, వేసవి శిబిరం ముగింపు వేడుక మూడో ఏపీఎస్పీ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మూడో ఏపీఎస్పీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కమాండెంట్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పదో తరగతి పరీక్షలలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు, వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రతి విద్యార్థికీ తల్లితండ్రుల ఆశీర్వాదాలు ఉండాలని ఆయన చెప్పారు. విద్యార్థులు తమ నైపుణ్యం పెంపొందించుకోవాలని, పదో తరగతి అనేది పునాది అని మీ ప్రతిభను ఇంకా పెంపొందించుకోవాలని ఆయన మాట్లాడారు. అడిషనల్ ఎస్పీ ఎల్ అర్జున్, అసిస్టెంట్ కమాండెంట్లు వీవీవీ సత్యనారాయణ, ఇతర అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్ విలియం బెనర్జీ, ఆర్ఎస్సై రామకృష్ణ, తల్లితండ్రులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీవైఈఓ పరీక్షలు

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డీవైఈఓ (డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్) రాతపరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా ఏపీపీఎస్సీ పరీక్షల నోడల్ అధికారి, డీఆర్వో డాక్టర్ డి.తిప్పేనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లాలో 1120 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 787 మంది హాజరు కాగా, 333 మంది పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. జిల్లాలో సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్రగతి ఇంజినీరింగ్ కాలేజ్ తదితర ప్రాంతాల్లో ఈ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. డీవైఈఓ రాతపరీక్షకు జిల్లాలో 72.32 శాతం అభ్యర్థులు హాజరైనట్టు నోడల్ అధికారి డాక్టర్ తిప్పేనాయక్ తెలిపారు.